క్లుప్తంగా

'సూక్తి చంద్రిక' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండలంలోని కంబదహాళ్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త, బాల బంధు డాక్టర్ గద్వాల సోమన్న సూక్తి చంద్రిక పుస్తకావిష్కరణ శనివారం వేడుకగా జరిగింది. ఆలూరులోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ విజయ భాస్కర్ సమక్షంలో పుస్తక పరిచయ సభ ఏర్పాటు చేశారు. వేసవి పునశ్చరణ కార్యక్రమం ముగింపు సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ, సంఘ సేవకురాలు, బహుభాషా కోవిదురాలు హత్తిబెళగల్లు రామలింగమ్మ, విశ్రాంత డీపీఓ శ్రీనివాసులు పుస్తకావిష్కరణ గావిస్తూ పిల్లలకు పరిచయం చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఉపాధ్యాయులు ఈరన్న, దేవదానం, మాజీ సైనికుడు నర్సిరెడ్డి, బాటప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఆదోని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగును తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదోని, మంత్రాలయం రైల్వే స్టేషన్లలో శనివారం రైల్వే పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయి, మత్తువంటి పదార్థాలను తరలిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తేవాలని ప్రయాణికులను కోరారు. ఈ సందర్భంగా ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: దైవందిన్నె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. విత్తన శుద్ధి చేసుకుంటే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని తెలిపారు. రైతులు సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఎలా పొందవచ్చునో రైతులు తెలుసుకోవాలని సూచించారు. రామాంజినేయులు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పాల్గొన్నారు.

పరామర్శ



వెంకట్రామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

నందవరం: మండల పరిధిలోని హెచ్.బాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు, మంత్రాలయం ఎమ్మెల్యే పీఏ వెంకటరామిరెడ్డి గాల్ బ్లాడర్‌లో రాళ్ల ఏర్పడడంతో కొద్ది రోజుల క్రితం ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, భార్య వై.జయమ్మ, కుమార్తె ప్రియాంకతో కలిసి శనివారం పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు నరహరిరెడ్డి తదితరులు ఉన్నారు.

సాగులో నూతన విధానాలు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత డాక్టర్ మౌనిక

మంత్రాలయం రూరల్ : రైతులు సాగులో నూతన విధానాలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి హార్టికల్చర్ శాస్త్రవేతలు డాక్టర్ వై.మౌనిక, డాక్టర్ భార్గవి సూచించారు. శనివారం మండలంలోని చిలకడోణ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేవీకే శాస్త్రవేతలు నూతన విధానాలపై అవగహన కల్పించారు. వీఏఏ మౌనిక ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడబూరులోని ఈద్గా వద్ద సందేశమిస్తున్న మత గురువు.



కోసిగిలోని ఈద్గా దగ్గర నమాజ్ చేస్తున్న ముస్లింలు



పండుగ ప్రత్యేకతను వివరిస్తున్న దర్గా ధర్మకర్త



పెద్దతుంబళం దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ఆదోని జామియ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణ ,గ్రామీణ ప్రాంతాల్లో హజ్రత్ ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ భక్తి శ్రద్ధలతో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం షాహి జామియా మసీదు, ఈద్గాలతో పాటు పెద్దతుంబళం,పెద్దహరివాణం, సంతకుడ్లూరు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలను చేశారు. మత గురువులు మాట్లాడుతూ త్యాగ గుణాన్ని ప్రబోధించే పండుగను స్ఫూర్తిగా తీసుకుని సమైక్యత, సమానత్వం చాటాలన్నారు. స్వార్థం అసూయ, రాగ ద్వేషాలకు అతీతంగా జీవించాలని సూచించారు.అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

- ఆదోని రూరల్: మండలంలో శనివారం బక్రీద్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని దర్గాల వద్ద ముస్లింలు మతపెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.
- మంత్రాలయం రూరల్ : బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్యాగనిరతి, దాతృత్వంతో మెలగాలని మత పెద్దలు సూచించారు. మత పెద్దలు కాజ బందే నావాజ్, ఆమాన్, రఫి, కాజా, రహిమాన్ పాల్గొన్నారు.
- పెద్దకడబూరు : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మత గురువులు అబ్దుల్ రహమాన్, ఫరీద్ ఆఫీసాబ్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం ముస్లింలు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మసీదు నుంచి ఆదోని రహదారిలో ఉన్న ఈద్గా దగ్గరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు మాట్లాడుతూ త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే ఈ పండుగ రోజున సమస్త మానవాలికి శాంతి చేకూరాలన్నారు.
- కోసిగి : మండల కేంద్రం కోసిగిలో బక్రీద్ పడుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం స్థానిక జామియా మసీద్, నూరానీ సున్నీ, మదీనా, మసీద్ ఏ ఆక్సా మసీదుల నుంచి ర్యాలీగా బయలుదేరి ఈద్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు జాకీర్ మౌలానా పండుగ ప్రత్యేకతను వివరించారు. సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.
- కౌతాళం: మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తెల్లవారుజామున ఐదు గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఉదయం 7–30గంటల కంత మజీద్‌కు చేరి అక్కడి నుంచి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో మౌలానా మన్జర్ అదీబ్, ఖాజీసాబ్ అబ్దుల్ మాట్లాడుతూ నమాజు విశిష్టతను వివరించారు. ఖాదర్‌లింగస్వామి దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నాపాషా చిష్తీ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజు ఆచరించి ఫాతెహాలు చేపట్టి పండుగ శుభకాంక్షలు తెలుపుకున్నారు.



కుంటనహాల్‌లో దువా చేస్తున్న దృశ్యం



మంత్రాలయం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గోనెగండ్ల: సందేశం ఇస్తున్న మతగురువు



గోనెగండ్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హాలహర్విలో..



నదికైరవాడిలో..



నాగలదిన్నెలో..

త్యాగ గుణం గొప్పది

ఎమ్మిగనూరు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా శివనీలకంఠ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

గోనెగండ్ల: ఇస్లాం ధర్మంలో భగవంతున్ని సంతృప్తి పరిచేందుకు త్యాగగుణం ఒక ఉత్తమ మార్గమని మత గురువు ఖతీబ్ హఫీజ్ అనాస్ తెలిపారు. మండల కేంద్రం గోనెగండ్లతో పాటు ఐరన్‌బండ, హెచ్.కైరవాడి, పెద్దనేలటూర్, పెద్దమరివీడు, కులుమాల, వేముగోడు, గంజిహళ్లి, చిన్నమరివీడు, అలువాల తదితర గ్రామాల్లో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- నందవరం: మండల కేంద్రంతో పాటు నాగలదిన్నె, నదికైరవాడి, కనకవీడు, మాచాపురం, హాలహర్వి, ముగతి, సోమలగూడూరు, పోనకలదిన్నె తదితర గ్రామాల్లో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మసీదుల నుంచి ర్యాలీగా బయలుదేరి ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నందవరం మసీదు నుంచి ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనాలు నిర్వహించారు. అనంతరం మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. మత పెద్దలు ఈసూబ్, మహమ్మద్ అనీఫ్, ఉసేన్‌సాబ్, షేక్షావలి, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

క్రికెట్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ తరపున పట్టణానికి చెందిన అండర్–15లో ఇద్దరు బాలికలు, అండర్–19లో బాలురలు జిల్లా నుంచి జోనల్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం స్థానిక భీమాస్ హోటల్‌లో క్రీడాకారులు అండర్–15 బెస్ట్ బ్యాటర్ జోత్స్న, ఫాస్ట్ బౌలర్ మేఘనారెడ్డి, అండర్–19 నుంచి ఫాస్ట్ బౌలర్లు అక్షయ్, రవితేజను అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, ఉపాధ్యక్షుడు ముజీబ్, సెక్రటరీ వెంకటేష్, జాయింట్ సెక్రటరీ బాషా, కోచ్ బాలాజీ అభినందించారు. విట్టా రమేష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి అండర్–15కు ఇద్దరు బాలికలు, జోనల్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంపికై ఈనెల 9 15వ తేదీ వరకు నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే.. అండర్–19కు ఇద్దరు ఎంపికైన వారు ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు కడపలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. జోనల్ అంతర్ జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిస్తే స్టేట్ లెవెల్ పోటీల్లో ఆడతారని తెలిపారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రం కౌతాళంతో పాటు మండలంలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన, బుదుములదొడ్డి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి విశేష పూజలు చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ

ఎమ్మిగనూరురూరల్: ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌లో జీనియస్ గ్లోబల్ జూనియర్ కాలేజీ విద్యార్థిని ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ గురజాల గంగాధర్‌రెడ్డి తెలిపారు. తమ కాలేజీకి చెందిన మొదటి బ్యాచ్ విద్యార్థిని అనూషమాధురి ఆల్ ఇండియా 3610 ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. మంచి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.

ఎల్లార్తి రోడ్డు మరమ్మతులు ప్రారంభం



హొళగుంద సమీపంలో పనులు చేస్తున్న దృశ్యం

హొళగుంద: హొళగుంద–ఆలూరు వయా ఎల్లార్తి పంచాయతీరాజ్ రోడ్డులోని హొళగుంద నుంచి చిన్న హ్యాట వరకు ఉన్న రోడ్డులో మరమ్మతు పనులు మొదలయ్యాయి. ఈ రోడ్డు అడుగడుగునా గుంతలు పడి రాళ్లు, రప్పలు తేలి ప్రమాదకరంగా మారింది. ఇటీవల వర్షాలు కురవడంతో రోడ్డు మరింత దారుణంగా తయారైంది. దీంతో ఈ మార్గంలో ఆయా గ్రామాల ప్రజలతో పాటు ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలకు వచ్చే ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారు. సమస్యపై గత నెల 30న సాక్షి దినపత్రికలో «అధ్వానం..ఎల్లార్తి రోడ్డు» అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీరాజ్ శాఖాధికారులు శుక్రవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభించారు. నాబార్డ్ నిధులు రూ.4 కోట్లతో హొళగుంద– ఆలూరు వయా ఎల్లార్తి మార్గంలో హొళగుంద నుంచి చిన్నహ్యాట వరకు 4 కి.మీ మేర బీటీ రోడ్డు, ఆలూరు వరకు ప్యాచ్ వర్క్‌లు, ఆలూరు టౌన్‌లో కొన్ని పనులు చేయనున్నట్లు పీఆర్ డీఈఈ (పిఐయూ) భాస్కర్ తెలిపారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి



సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని, రాయలసీమలో జిల్లా కేంద్రాలను కలుపుతూ నూతన రైలును నడిపి ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని స్థానిక బి.ఆర్.అంబేడ్కర్ సర్కిల్‌లో చేపట్టారు. వారు మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 7, 8వ తేదీల్లో పట్టణ ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 9న స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేపట్టి అనంతరం స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఎంతో చరిత్ర ఉన్న ఆదోని రైల్వేస్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడం దారుణమన్నారు. కుమారస్వామి, ఏఐటీయూసీ నాయకులు వెంకన్న, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, బసాపురం గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన టీటీడీ కార్యక్రమాలు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న టీటీడీ ధార్మిక కార్యక్రమాలు ముగిశాయని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి శనివారం తెలిపారు. ముందుగా గోమాతకు పూజ చేసి ఊరేగింపు నిర్వహించి సామూహిక కుంకుమార్చన జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్త కొండగేరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆదోని సెంట్రల్: కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన హరిజన చిట్టెమ్మ(38) అనే మహిళ శనివారం ఉదయం 9;45 గంటల సమయంలో గూడ్స్ రైలు కింద మృతి చెందినట్లు ఆర్‌పీహెచ్‌సీ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాలు.. మృతురాలికి వివాహమై 15 ఏళ్లు అయినా పిల్లలు కలగకపోవడం, గతంలో భర్త హరిజన చిన్న వెంకటేష్‌కు యాక్సిడెంట్ కావడం.. దీంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వైభవం.. కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు

ఆస్పరి: మండలంలోని హలిగేరి సమీపంలోని గుహలో వెలసిన శ్రీ స్వయంభూ కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు నరేష్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి క్షీర, చందనాభిషేకం, నదీ జలాలతో అభిషేకం, శ్రీలక్ష్మీ అష్టోత్తర సహిత, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రావిచెట్టుకు పూజలు, హనుమప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారి చిత్ర పటంతో గిరి ప్రదక్షిణ, పుట్టలకు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు పీఠాధిపతులకు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గంగావతికి చెందిన మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకుంది. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పీఠాధిపతుల ప్రత్యేక పూజలు..

జయంత్యుత్సవాలకు విద్యాభినవ సుబ్రహ్మణ్య భారతి మహాస్వామి, అవ్యక్తానంద సరస్వతి, శివ యోగేంద్ర సరస్వతి స్వామి, జగద్గురు శంకరాచార్య శ్రీవిద్యానృసింహ భారతిస్వామి, పాండు రంగానంద భారతి స్వామి, రుక్మిణీమాత, శివానంద చైతన్య స్వామి, గురు సుబ్రహ్మణ్యం, స్వామి శంకరానంద గిరి, సురేంద్ర మహారాజ్, అనంతాంద భారతి స్వామి, రామాంజనేయులు గురుస్వామి, మాడగుల అనిల్‌కుమార్ శర్మ, రామిరెడ్డిగారి అరుణారెడ్డి తదితర పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు.



జొహరాపురం బస్టాండ్ వద్ద కురుస్తున్న వర్షం



పూలచింతలో పత్తి విత్తనాలను నాటుతున్న కూలీలు

జోరుగా విత్తన పనులు



గంగవరంలో చద్ది ఆరగిస్తున్న వ్యవసాయ కూలీలు

నందవరం: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తుండడంతో సాగు సందడి మొదలైంది. నిన్నటి వరకు వెలవెలబోయిన పొలాలు నేడు సాగుకు సన్నద్ధమవుతున్నాయి. శనివారం మండలంలోని నదికైరవాడి, కొత్తకైరవాడి, గంగవరం, పూలచింత, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, నందవరం గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. వానలకు మండల పరిధిలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నందవరం, పూలచింత, జోహరాపురం, నదికైరవాడి, హారిహర్వి, ముగతి తదితర గ్రామాల్లో విత్తన పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే నది తీర గ్రామాలు, బోరు బావుల దగ్గర దాదాపు 250 హెక్టార్లు పంటలు సాగు చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు సాగు చేసిన పంటలకు ప్రాణం పోయగా సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారడంతో రైతులు విత్తనం విత్తులో బిజీ బిజీగా ఉన్నారు. ఈ వర్షాలకు పత్తి, కంది తదితర పంటలు సాగు చేస్తూ రైతులు బిజీగా ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం, సహాయం లేకపోవడంతో అన్నదాతలు అసంతృప్తిలో ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని కోరుతున్నారు.

గురుకుల కళాశాలకు విద్యార్థుల ఎంపిక



రక్షిత



వంశీ



కరుణకుమార్



జస్వంత్



వినయ్



విజయ్

కోసిగి : మండల కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఇంటర్‌లో గురుకుల కళాశాలకు ఎంపికయ్యారు. ఇందులో ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుకున్న బి.వినయ్, మౌంట్ కార్మెల్ విద్యార్థి జశ్వంత్ చిన్నటేకూరు గురుకుల కళాశాలకు, ఏపీ మోడల్‌లో చదువుకున్న విజయ్ అన్నమయ్య జిల్లా కొత్తకోట గురుకుల కళాశాలకు, కోసిగి బాయ్స్ హైస్కూల్‌లో చదువుకున్న ఎస్.వంశీ రామాపురం గురుకుల కళాశాలకు, కరుణకుమార్ సీ.బెళగల్ గురుకుల కళాశాలకు ఎంపికయ్యారు. బాలికల పాఠశాల విద్యార్థిని రక్షిత గుత్తి గురుకుల కళాశాలకు ఎంపికయ్యారు.